క్లుప్తంగా

ఆకట్టుకున్న వయోలిన్ కచేరీ



వయోలిన్ కచేరి నిర్వహిస్తున్న త్యాగరాజ సంగీత విద్యాపీఠం సభ్యులు

పిఠాపురం: స్థానిక గోపాల్‌బాబా ఆశ్రమంలో యానాంకు చెందిన త్యాగరాజ సంగీత విద్యా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వయోలిన్ కచేరీ ఆద్యంతం శ్రోతలను ఆకట్టుకుంది. త్యాగరాజ సంగీత విద్యా పీఠం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈ కచేరీ ఏర్పాటు చేశారు. త్యాగరాజ సంగీత విద్యా పీఠం లక్ష్యాలను పీఠం అధ్యక్షురాలు శిరీష కుసుమ వివరించారు. అనంతరం విద్యాపీఠం సభ్యులతో వయోలిన్ కచేరీ నిర్వహించారు. కార్యక్రమంలో త్యాగరాజ సంగీత విద్యా పీఠం సభ్యులు మహేంద్రవాడ నరసింహమూర్తి, గట్టి శ్రీకృష్ణదేవరాయలు, సంగీత అధ్యాపకులు గాయత్రి, గోపాల్‌బాబా ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టైలర్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న టైలర్లు

పిఠాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో భార్యను కోల్పోయి, తీవ్ర గాయాల పాలైన ఏలూరు జిల్లా కోయిలగూడెం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన టైలర్ రవీంద్రకు గొల్లప్రోలు మండల టైలర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండల జైగణేష్ టైలర్ల ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు బత్తుల కొండలరావు ఆధ్వర్యంలో టైలర్లు రూ.6,751 ఆర్థిక సహాయాన్ని అనకాపల్లి జిల్లా మాకవారిపాలెం మండల టైలర్ల సంఘం అధ్యక్షుడు జె.జగన్‌కు అందజేశారు. పలువురు టైలర్లు పాల్గొన్నారు.

వచ్చే నెల 3న కాపు కార్తీక వన సమారాధన

సామర్లకోట: కాపు వన సమారాధనను డిసెంబరు 3న విస్తరణ శిక్షణ కేంద్రంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి వర్గాల వారు ఈ సమారాధనలో పాల్గొనాలన్నారు.

సమస్యకు మోక్షం

- గొంచాల-అచ్చంపేట కూడలి వద్ద రోడ్డు పనులు ప్రారంభం
- గత పాలకుల నిర్లక్ష్యంతో హైవేపై తరచూ ప్రమాదాలు
- పరిష్కారానికి చొరవ చూపిన ఎంపీ, కలెక్టర్లు



జాతీయ రహదారిని కలుపుతూ గొంచాల-అచ్చంపేట కూడలిలో ఎత్తుగా నిర్మిస్తున్న రోడ్డు

సామర్లకోట: కత్తిపూడి నుంచి అమలాపురం వరకు మండలంలోని అనేక గ్రామాల మీదుగా 216 జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. గత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న నిమ్మకాయల చినరాజప్ప అచ్చంపేట గ్రామంలోనే నివసిస్తున్నా, రోడ్డు సమస్యను పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై మండలంలోని ఉండూరు, పి.వేమవరం, గొంచాల, నవర, చంద్రంపాలెం, అచ్చంపేట, పవర, పంద్రవాడ, పనసపాడు గ్రామాలకు చెందిన ప్రజలు.. గొంచాల-అచ్చంపేట గ్రామాల కూడలి ప్రదేశంలో అండర్ పాస్ నిర్మాణం చేయాలని డిప్యూటీ సీఎంగా ఉన్న రాజప్ప దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. 216 రోడ్డు గొంచాల-అచ్చంపేట గ్రామాల మీదుగా వెళుతుంది. అండర్ పాస్ నిర్మాణంపై నిర్లక్ష్యం చేయడంతో ఈ రెండు గ్రామాల కూడలిలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక లోడ్ ట్రాక్టర్లు బోల్తా పడిన సంఘటనలు కోకొల్లలు. గొంచాల, అచ్చంపేట వైపు ఉన్న రోడ్లు పల్లంగా ఉండటం, 216 రోడ్డు ఎత్తుగా ఉండటంతో తరచూ ప్రమాదాలకు దారితీస్తోంది. రోడ్డు ప్రారంభం జరగక ముందే ప్రమాదాలు పెరగడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఇటీవల అచ్చంపేట వచ్చిన కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, జిల్లా కలెక్టరు కృతికా శుక్లా దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దాంతో అచ్చంపేట-గొంచాల కూడలిలోని 216 జాతీయ రహదారిని వారు పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన రోడ్డును కట్ చేసి, అండర్ పాస్ నిర్మించడం సాధ్యం కాదని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు రెండు గ్రామాల వైపు ఉన్న రోడ్లను విస్తరించి, ఎత్తుగా చేసి ప్రమాదాలు జరగకుండా చేస్తామని కలెక్టరు, ఎంపీలు హామీ ఇచ్చారు. ఆ మేరకు గొంచాల-అచ్చంపేట కూడలిలో పనులనూ ప్రారంభించారు. 216 రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామాల రోడ్లు వెడల్పు, ఎత్తుగా చేయడంతో ప్రమాదాలు నియంత్రించే అవకాశం ఉంది.



గ్రామాల రోడ్డు మార్జిన్‌లో రివిటింగ్ పనులు

ఆలోచన ఉండాలి



డిప్యూటీ సీఎంగా ఉన్నప్పటి నుంచి అచ్చంపేట గ్రామంలో ఉంటున్న రాజప్ప గొంచాల-అచ్చంపేట గ్రామ కూడలిలో రోడ్డు సమస్యను పట్టించుకోలేదు. దాంతో ఈ ప్రదేశంలో తరుచూ ప్రమాదాల సంఖ్య పెరిగింది. ఇటీవల ఎంపీ వంగా గీత, జిల్లా కలెక్టరు కృతికా శుక్లా దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో, వేగంగా రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తీర్ణానికి విద్యుత్ స్తంభాల మార్పునకు ఎంపీ నిధులు మంజూరయ్యాయి.

– వీరంరెడ్డి చిన్నబాబు, సర్పంచ్, అచ్చంపేట

స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి



జాతీయ రహదారిపై గొంచాల-అచ్చంపేట మీదుగా వెళుతున్న సమయంలో రెండు గ్రామాల కూడలిలో కాను ఏర్పాటు చేయాల్సి ఉండగా నిర్లక్ష్యం చేశారు. ఎంపీ గీత కృషితో రెండు గ్రామాలకు ఇరువైపులా రోడ్డు విస్తరించడంతో పాటు, రివిటింగ్ పనులు జరుగుతున్నాయి. అచ్చంపేట, మాధవపట్నం ప్రాంతాల్లో వంతెన పనులు పూర్తయితే రోడ్డులో వాహనాల రాకపోకల సంఖ్య పెరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రెండు గ్రామాల కూడలిలో జాతీయ రహదారిపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేసి, రేడియం పెయింటింగ్ వేయాలి.

– కర్రి బుజ్జి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి, గొంచాల

ఘనంగా లలితా, విష్ణు సహస్రనామ పారాయణలు



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో లలితా పారాయణ చేస్తున్న మహిళలు

పిఠాపురం: స్థానిక శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆధ్వర్యంలో సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవా ల్లో భాగంగా ఆదివారం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆలయంలో విష్ణు సహస్రనామాలు, లలితా సహస్రనామాలు పఠించారు. పిఠాపురానికి చెందిన వాసవీ గీతా మహిళా సమాజం సభ్యులు విష్ణు సహస్రనామాలు, లలితా సహస్రనామాలు ఆలపించారు. సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో వారం రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు సనాతన ధర్మంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పూజల్లో పాల్గొ న్న మహిళలకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్షబిల్వార్చన



వాకతిప్పలో అయ్యప్ప భక్తుల పడిపూజ

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప పద్మశాలి రామాలయం వద్ద ఆదివారం అయ్యప్పస్వామి పడి పూజ, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అయ్యప్ప మాల ధరించిన స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో గ్రామం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. వాకతిప్పతో పాటు కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, ఉప్పాడ గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు పడి పూజలో పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన



పంచారామ క్షేత్రంలో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: కార్తికమాసాన్ని పురస్కరించుకుని స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. ఆలయంలో లక్ష పత్రి పూజలు చేసిన భక్తులు జ్యోతిర్లింగార్చనలో దీపాలను వెలిగించారు. ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పిఠాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ఆదివారం వివిధ పాఠశాలల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల కామర్స్ అధ్యాపకురాలు కె.శ్యామసుందరి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి ఆర్.వెంకటరాము ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యప్రియ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉప్పాడ గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై గ్రంథాలయాధికారి నళినీ ప్రియ అవగాహన కల్పించారు.

యువతతోనే సమసమాజ స్థాపన సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం అధ్యక్షుడు రాజబాబు

కొత్తపల్లి: సమసమాజ స్థాపన యువతతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. స్థానిక ఎస్సీ పేటలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమర వీరుల సంస్మరణ సభను నిర్వహించారు. విప్లవ నేత చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామం ర్యాలీ చేశారు. అమరవీరుల ఆశయాలను సాధిస్తాం, భూ పోరాటాలు వర్ధిల్లాలి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం మండల అధ్యక్షుడు గెద్దం మహాలక్ష్మి, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.అంజిబాబు, పీఓడబ్ల్యూ స్త్రీ విముక్తి కన్వీనర్ మంగక్క, ఏపీఆర్‌సీఎస్ నాయకులు ఎల్లే సత్తిబాబు, చార్లెస్, పెద్ద బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పెద్దాపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. లైబ్రేరియన్ పాలంగి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో సీఐ రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మురళీమోహన్ అన్నారు. తొలుత ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోశ్యుల కృష్ణబాబు, మిరియాల జయశ్రీ, సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

తీరంలో వనభోజనాల సందడి



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ తీరం



బీచ్‌లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ సాగర తీరంలో ఆదివారం వనభోజనాల సందడి నెలకొంది. కార్తిక మాసంలో మొదటి ఆదివారం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు, భక్తులు బీచ్‌కు తరలివచ్చి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా వివిధ రకాల ఆటపాటలతో పర్యాటకులు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగర తీరంలో సేదతీరారు. పర్యాటకుల ఆటపాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం లోవ దేవస్థానంలోని తలుపులమ్మను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు. పసందైన వన భోజనాలు చేసి కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వసతుల లేమితో ఇక్కట్లు

తీరంలో ఎక్కడా ఎటువంటి వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం కూర్చోవడానికి బెంచీలు, తాగేందుకు నీరు అందుబాటులో లేక ఇక్కట్లకు గురయ్యారు. పర్యాటక ప్రాంతంగా మారుతున్న ఉప్పాడ బీచ్‌లో వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నారాయణరెడ్డి

కొత్తపల్లి: నాగులాపల్లి-రమణక్కపేట రహదారిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రమణక్కపేట గ్రామానికి చెందిన అనిశెట్టి నారాయణరెడ్డి (47) ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లాడు. నాగులాపల్లి నుంచి రమణక్కపేట వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు అతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణరెడ్డి తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఘనంగా నంది విగ్రహ ప్రతిష్ఠ

పెద్దాపురం: పులిమేరు గ్రామ సచివాలయం సమీపంలో నంది విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ తుమ్మల అజ్జావతి, సూర్యకృష్ణమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్తిక మాసం తొలి సోమవారం పురస్కరించుకుని పులిమేరు మెయిన్ రోడ్డు సాయిబాబా గుడి వద్ద వన సమారాధన నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు తుమ్మల నాని తెలిపారు. అలాగే గ్రామంలో సోమవారం అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్నారు.

కౌన్సిలర్ చొరవతో ప్రమాదాలకు చెక్

సామర్లకోట: డ్రైనేజీపై శ్లాబ్ శిథిలం కావడంతో స్థానిక 13వ వార్డులో తరుచూ ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిని గమనించిన వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు సొంత సొమ్ముతో డ్రైనేజీ శ్లాబ్‌లు ఏర్పాటు చేయించి, ప్రమాదాలకు చెక్ పెట్టారు.

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సునేత్రదేవి



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సామర్లకోట: మహిళలకు అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి ప్రాధాన్యమిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి ముఖ్యఅతిథి సునేత్రదేవి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఏటా ఈ గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సునేత్రదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. అటువంటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని కోరారు. లైబ్రేరియన్ బందిల రత్నమణి మాట్లాడుతూ ఇందిరాగాంధీ జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సోమవారంతో గ్రంథాలయ వారోత్సవాలు ముగుస్తాయని లైబ్రేరియన్ తెలిపారు.

ఐక్యతకు దోహదం వన సమారాధన



కార్తిక వన సమారాధనలో పాల్గొన్న పోస్టల్ ఉద్యోగులు

పెద్దాపురం: కుటుంబాల్లో ఐక్యతను చాటేందుకు కార్తిక వనసమారాధనలు దోహదపడతాయని పలువురు వక్తలు అన్నారు. పులిమేరులో ఆదివారం కాకినాడ డివిజనల్ పోస్టల్ కాపు ఉద్యోగ సేవా సమితి కార్తిక వన సమారాధన జరిగింది. జనసేన పార్టీ నాయకుడు తుమ్మల బాబు, పోస్టల్ శాఖ ఏఎస్‌పీలు ఆదినారాయణమూర్తి, భద్రరావు మాట్లాడుతూ ఉద్యోగుల్లో ఐక్యత చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగులు తమ సీనియర్లను సత్కరించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఐపీఓ ప్రకాశరావు, సంఘ సభ్యులు ఇంటి సుబ్బారావు, అడ్డగర్ల సురేంద్రనాథ్, పేపకాయల వీర్రాజు, చవ్వాకుల ఈశ్వరరావు, చలం, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే సేవా భావం



కార్యక్రమంలో పాల్గొన్న దవులూరి సుబ్బారావు

సామర్లకోట: మానవుడికి ఆధ్యాత్మికతతోనే సేవా భావం అలవడుతుందని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు దవులూరి సుబ్బారావు అన్నారు. శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ స్వగృహంలో నిర్వహించిన రామకృష్ణ సంకీర్తన, భజనలో ఆయన పాల్గొన్నారు. సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అందరినీ చేరదీసే గుణం కలిగి ఉండాలన్నారు. ఆయన గేయ కీర్తనలు చేసి అలరించారు. సమితి ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. సమితి నాయకులు వింజమూరి విశ్వనాథశర్మ, నువ్వుల బాబ్జి, తోటకూర సాయిరామకృష్ణ, టీవీవీ సత్యనారాయణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

అయోధ్య రామపురంలో భారీ అన్నదానం



మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన అన్నదానం

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక స్థానిక అయోధ్య రామపురంలోని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. కనక దుర్గ ఆలయం వద్ద నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పైడి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, వర్తక సంఘ అధ్యక్షుడు చుండ్రు గోపాలకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, కౌన్సిలర్ బలుసు వాసు, మహిళా సంఘ ప్రతినిధులు భక్తులకు సేవలందించారు. సుమారు 8 వేల మందికి అన్నదానం చేసినట్టు రామకృష్ణ తెలిపారు.

ఉత్సాహంగా జాతీయ గణిత పోటీలు ఫైనల్



గణిత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సామర్లకోట: రామానుజన్ గణిత అకాడమీ నిర్వహిస్తున్న 34వ జాతీయ గణిత పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సంస్థ కార్య నిర్వాహక సభ్యుడు, ప్రముఖ గణితావధాని తోటకూర సాయిరామకృష్ణ విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. ప్రిలిమనరీ పరీక్షలు గత సెప్టెంబరులో ఆయా పాఠశాలల్లో జరిగాయన్నారు. వీటిలో ప్రతిభ చూపిన పది శాతం విద్యార్థులను ఫైనల్ పరీక్షకు ఎంపిక చేసి, నిర్ణయించిన కేంద్రాల్లో పోటీ పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. సెంటర్ కన్వీనర్‌గా కె.శివప్రసాద్ వ్యవహరించారు. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో విలువైన బహుమతులు, నగదు పురస్కారాలతో సత్కరించనున్నట్టు సాయిరామకృష్ణ చెప్పారు. వచ్చే నెల 17న రామచంద్రపురంలో బహుమతి ప్రదాన కార్యక్రమం సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు.

పంచారామ క్షేత్రంలో బందోబస్తుపై సమీక్ష



పంచారామ క్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ, ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో బందోబస్తుపై సీఐ డి.సురేష్ సమీక్షించారు. స్థానిక పోలీసు స్టేషన్ సీఐగా శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆదివారం ఆలయంలో స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్న సీఐ.. ఆలయంలో జరిగే ఉత్సవాలపై సమీక్ష చేశారు. కార్తిక సోమవారాలు, కార్తిక పౌర్ణమి, ఈ నెల 29న స్వామివారి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా తెపోత్సవం ఉంటాయని ఆలయ అధికారులు ఆయనకు తెలిపారు. ఆయా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని చెప్పారు. సీఐ వెంట ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఏఎస్సై రత్నం ఉన్నారు.